Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 286
పేజీలు :3
శనివారం 16.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

www.tmedia.net.in
డిజిటల్ మీడియాలో అగ్రగామిగా ముందుకు సాగుతున్న
Digital, tmedia.net.in
Editor : Nagamalli Murali Krishna
★ సామాజికం... ప్రజల పక్షంగా... ★
కేంద్ర ప్రభుత్వ ఐటీ ఎథిక్స్ కోడ్‌కు అనుగుణంగా నడుస్తున్న
T MEDIA
E-PAPER
మెయిన్ ఎడిషన్ | సామాజికం... ప్రజల పక్షంగా... | ప్రజా స్వరం - మా ధ్యేయం
ఈ పేపర్‌కు జిల్లా వారీగా ఫ్రాంచైజీలు ఇవ్వబడుతున్నాయి.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
కాల్ చేయండి:
8919710365
సంచిక : 255
సంపుటి : 8
పేజీలు : 3
SCAN TO VISIT
GSTIN 36FDKPS1308P1ZX
Analytics ID UA-194163459-1
Domain ID DC7812B9B3101414BB98847D724E48B3A-IN
నిజాయితీగా...
నమ్మకంతో...
సమాజం కోసం...
ప్రజల పక్షంగా...
Following IT Ethics Code of Government of India | www.tmedia.net.in | /tmediadigital

## దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్

# ధరల పెంపు



- లీటరుకు రూ.3 భారంతో సామాన్యులకు షాక్
- రవాణా రంగంతో పాటు ,మధ్యతరగతిపై భారం

**టి మీడియా, మే 15, ఢిల్లీ బ్యూరో:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు భారీగా పెంచాయి. లీటరు పెట్రోల్‌పై రూ.3, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , భారత్ పెట్రోలియం , హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. దాదాపు నాలుగేళ్ల తర్వాత ఇంధన ధరల్లో ఇంత పెద్ద మార్పు చోటుచేసుకోవడం గమనార్హం.అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడం, హర్మూజ్ జలసంధి మార్గంలో అంతరాయాలు ఏర్పడటం వంటి కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగుతోంది. యుద్ధ ప్రభావం పశ్చిమాసియా దేశాలపై పడటంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాపై ఆందోళనలు నెలకొన్నాయి.ఇంధన ధరల పెంపుతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.97.77కు చేరుకోగా, డీజిల్ ధర రూ.90.67గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.108.74, డీజిల్ రూ.95.13గా ఉండనుంది. ముంబయిలో పెట్రోల్ ధర రూ.106.68కు చేరుకోగా, డీజిల్ రూ.93.14గా ఉంది. చెన్నైలో పెట్రోల్ రూ.103.67, డీజిల్ రూ.95.25గా నిర్ణయించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంధన ధరలు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 చొప్పున పెంపు నమోదైంది. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 చొప్పున ధరలు పెరిగాయి. దీంతో రోజువారీగా వాహనాలు వినియోగించే ప్రజలపై అదనపు భారం పడనుంది.ఈ ధరల పెంపుతో రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన పరిస్థితుల్లో ఇంధన ధరల పెంపు మరింత ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని భావిస్తున్నారు. సరుకు రవాణా ఖర్చులు పెరగడం వల్ల కూరగాయలు, పాలు, ధాన్యాలు, ఇతర అవసర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చమురు సంస్థలు రోజువారీ ధరల సవరణ విధానాన్ని 2022 ఏప్రిల్‌లో నిలిపివేశాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో దేశీయ వినియోగదారులపై భారం పడకుండా అప్పట్లో ధరలను స్థిరంగా ఉంచాయి. ఆ నిర్ణయం వల్ల ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. అయితే తర్వాతి కాలంలో ముడి చమురు ధరలు తగ్గడంతో కొంతవరకు ఆ నష్టాలను భర్తీ చేసుకున్నాయి. ఇటీవల పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల కారణంగా మళ్లీ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు 50 శాతం వరకు పెరిగినట్లు సమాచారం. ఫిబ్రవరిలో భారత్ దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ సగటు ధర బ్యారెల్‌కు 69 డాలర్లుగా ఉండగా, అనంతర నెలల్లో అది 113–114 డాలర్ల వరకు పెరిగింది. ఈ పరిస్థితుల్లో చమురు సంస్థలపై ఆర్థిక భారం పెరగడంతో ధరల పెంపు తప్పనిసరి అయిందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే దేశంలో ఇంధన కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఇటీవల దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో తీవ్ర ఒడిదుడుకులు ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా ఇంధన సరఫరాను నిరంతరంగా కొనసాగిస్తున్నామని చెప్పారు.ముడి చమురు నిల్వలు స్థిరంగా ఉన్నాయని, రిఫైనరీలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు తగినంతగా ఉన్నాయని, ఎక్కడా కొరత పరిస్థితులు లేవని స్పష్టం చేసింది. అయితే ధరల పెంపు కారణంగా సామాన్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, డెలివరీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్ రంగానికి చెందినవారిపై ఈ ప్రభావం ఎక్కువగా పడనుంది. ఇప్పటికే పెరిగిన జీవన వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న మధ్యతరగతి ప్రజలకు ఈ నిర్ణయం మరో ఆర్థిక భారం కానుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




## 5 రోజుల పాటు
# ఢిల్లీకి లారీలు బంద్

### ఏపీ లారీ యజమానుల సంఘం కీలక నిర్ణయం

**టి మీడియా, మే 15, అమరావతి బ్యూరో :**



ఈ నెల 18 నుంచి ఐదు రోజులు ఢిల్లీతోపాటు దేశ రాజధాని ప్రాంతానికి సరకు రవాణా నిలిపివేయాలని లారీ నిర్వాహకులకు ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఢిల్లీలో ట్రక్ చక్కా జామ్ (బంద్) పేరిట ఈ నెల 21 నుంచి మూడు రోజులు లారీ యజమానులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారికి మన రాష్ట్రం నుంచి లారీ యజమానులు మద్దతుగా నిలవాలని లారీ యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెప్పారు.

### బస్సు, క్యాబ్ నిర్వాహకులకు తీవ్ర నష్టం

పర్యావరణ పరిహార సెస్, ఢిల్లీకి వచ్చే యూరో 4 వాహనాలను నవంబర్ 1 నుంచి నిలిపివేయాలనే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ఈశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన డీజిల్ ఛార్జీలు రవాణా రంగంపై పెను భారం చూపుతాయని ఆయన తెలిపారు. ఇప్పటికే లారీ యజమానులకు పన్నుల రూపంలో ఏటా లక్షా 20 వేల రూపాయల పన్నులు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. తాజాగా పెరిగిన డీజిల్ ధరలు మరింత భారమవుతాయని అన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు తాజాగా ప్రతిపాదించిన వర్క్ ఫ్రం హోం విధానంతో మెట్రో నగరాల్లో బస్సు, క్యాబ్ నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతారని ఈశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు.

“న్యూ ఢిల్లీలో మే 21, 22, 23 తేదీల్లో స్థానికంగా ఉండే 62 సంఘాలతో ట్రక్ చక్కా జామ్ జరుగుతుంది. ఇందులో ప్రధానమైన డిమాండ్లు ఢిల్లీలోకి ప్రవేశించే లైట్ మోటార్ వెహికల్?కి రూ.2000, హెవీ మోటార్ వెహికల్?కి రూ.4000లను ఎంట్రీ టాక్స్ విధించారు. అలాగే నవంబర్ 1 నుంచి బీఎస్4 వాహనాలను రద్దు చేయాడానికి ప్రణాళికలు వేశారు. పర్యావరణ పరిహార సెస్ పేరిట బీఎస్6 వాహనాలకు భారీగా పన్నులు విధిస్తున్నారు. ఇదీ చాలా అన్యాయం. బీఎస్4 వాహనాలను అనుమతించి, BS6 వాహనాలకు పన్నులు రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అందులో భాగంగా ఈ నెల 18 నుంచి ఐదు రోజులపాటు ఏపీ నుంచి ఢిల్లీకు లారీలను నడవద్దని ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం ద్వారా లారీ నిర్వాహకులకు విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే ఈరోజు నుంచి పెట్రోల్, డీజిల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం పెంచింది, ఇది చాలా అన్యాయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై మరోసారి ఆలోచించి పెంచిన రేట్లను తగ్గించాలని కోరుతున్నాం.” – ఈశ్వరరావు, ఏపీ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి.

## ప్రపంచస్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో

### టిమ్స్ ఏర్పాటు చేశాం: కేటీఆర్

**టి మీడియా, మే 15, హైదరాబాద్ బ్యూరో :**

హైదరాబాద్ నగర ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో నాడు బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. గతంలో గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమైతే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యాధునిక టిమ్స్ హాస్పిటల్స్ అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు.హైదరాబాద్ ఎర్రగడ్డలోని టిమ్స్ ఆస్పత్రిపనులను శుక్రవారం ఉదయం కేటీఆర్పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాత మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోఐయిమ్స్ స్థాయి వైద్యం అందించేలా టిమ్స్‌ను ఆలోచించి రూపకల్పన చేశాం” అని తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్ కోసం 22 ఎకరాల విస్తీర్ణాన్ని వినియోగించామని పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ, ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో హాస్పిటల్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు పోటీగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్‌ను తీసుకువచ్చిందని అన్నారు. హైదరాబాద్‌లో సనత్‌నగర్, ఎల్‌బీనగర్, ఆల్వాల్ ప్రాంతాల్లో టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వరంగల్‌లో 2000 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. నిమ్స్ ఆసుపత్రిని కూడా భారీ స్థాయిలో విస్తరణ పనులు మొదలుపెట్టామని చెప్పారు.సనత్‌నగర్ టిమ్స్‌లో మొత్తం మూడు బ్లాకులు నిర్మించామని తెలిపారు. 300ఐ సి యూ బెడ్స్‌తో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రోగుల బంధువుల కోసం ప్రత్యేక ధర్మశాల ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.1200 కోట్ల వ్యయంతో టిమ్స్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. “కేసీఆర్ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈ ఆసుపత్రి రెండేళ్ల క్రితమే పూర్తయ్యేది” అని తెలిపారు.

ఈ టిమ్స్‌లో 16 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు.ఎం ర్ ఐ, సీటీ స్కాన్ సహా అన్ని డయాగ్నస్టిక్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రత్యేక వి ఐ పి సూట్స్ కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కిడ్నీ సంబంధిత వ్యాధులపై ప్రత్యేక పరిశోధనలు జరిగేలా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధిక వైద్య సిబ్బందితో కూడిన ప్రభుత్వ వైద్య వ్యవస్థగా టిమ్స్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రత్యేక రీసెర్చ్ బ్లాక్స్, అకాడెమిక్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. భారీ ఆడిటోరియం నిర్మాణం కూడా చేపట్టినట్లు తెలిపారు. ఒకేసారి 1000 కార్లు పార్క్ చేసేలా ఆధునిక పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు.టిమ్స్ హాస్పిటల్ డిజైన్ దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ వైద్య నిర్మాణాల్లో ఒకటి” అని కేటీఆర్ పేర్కొన్నారు. అత్యవసర సేవల కోసం ప్రత్యేక ఎమర్జెన్సీ ర్యాంప్ నిర్మించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి ప్రజలకు చేరువలో వైద్యం అందించామని గుర్తుచేశారు. మిగిలిన నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.



## ఐదో తరం విమానాలు గగనంలో
# ఎగరబోతున్నాయి

### పుట్టపర్తి వేదిక కాబోతోంది: రాజ్‌నాథ్‌సింగ్

**టి మీడియా, మే 15, సత్యసాయి :**




పుట్టపర్తి నుంచి ప్రపంచంలోని ప్రతి మూలకు డ్రోన్ సరఫరా చేసే క్షణం రాబోతోందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సమగ్ర సంపూర్ణ ప్రాంతీయ అభివృద్ధి త్వరలోనే సాకారం కాబోతోందని తెలిపారు. సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్‌సింగ్ తెలుగులో ప్రసంగం ప్రారంభించి ఎలా ఉన్నారు అంటూ ప్రజలను పలకరించారు. ఈ రోజు చరిత్రాత్మకమైన రోజు అని ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఇవాళ అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసుకున్నట్లు రాజ్‌నాథ్ వెల్లడించారు. విద్య, సేవ, ఆధ్యాత్మికతతో పుట్టపర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని రాజ్‌నాథ్?సింగ్ తెలిపారు. చంద్రబాబు వంటి దూరదృష్టి కలిగిన నాయకుడిని ఎక్కడా చూడలేదని ఏపీ అభివృద్ధికి ఇటువంటి నిబద్ధత కలిగిన నాయకుడు ఉండాలని కొనియాడారు. చంద్రబాబు దృక్పథం శాస్త్రీయమైనదని ఎన్నో అంతర్జాతీయ సంస్థలు ఈయన కృషిని గుర్తించాయని చెప్పారు. చంద్రబాబు వల్లే గూగుల్ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతుందని అన్నారు. ఏపీ అంటే అడ్వాన్స్ ఆంధ్రప్రదేశ్‌గా మారబోతుందని పేర్కొన్నారు. దేశ నిర్మాణం, సమష్టి కృషి, విశ్వ సోదర భావన స్ఫూర్తితో ముందుకెళ్దామని రాజ్‌నాథ్ సూచించారు.

### డ్రోన్ హబ్‌గా కర్నూలు

కొన్నేళ్లక్రితం రక్షణ రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లమని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయని వెల్లడించారు. 2004లో కేవలం భారత్ రూ.46 వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాలు తయారీ ఉండేదని ప్రస్తుతం రికార్డు స్థాయిలో లక్షా రూ.75 వేల కోట్లకు పెరిగిందని గర్వంగా చెబుతున్నామని అన్నారు. రక్షణ రంగంలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని వెల్లడించారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామని వివరించారు.దేశ రక్షణ అనే మహత్తర యజ్ఞంలో ప్రతిఒక్కరూ తమ సహకారం అందిస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య నమూనా రక్షణ రంగ తయారీకి ప్రజా ఉద్యమంగా మారిందని స్థానిక యువతకు అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీ సంపూర్ణ అభివృద్ధికి దోహదపడేలా ఈ పరిశ్రమలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయని వెల్లడించారు. యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారిందని అన్నారు. ఇకనుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు.

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి పడిపోయిన రూపాయి

- డాలర్‌తో పోలిస్తే రూ.96.14కు

3లో..

## నీట్ పేపర్ లీక్ కేసులో సూత్రధారి గుర్తింపు

- పి.వి.కులకర్ణి అరెస్ట్?

3లో..

## భగీరథ్ కేసులో బండి సంజయ్‌పై
# దుష్ప్రచారం ఆపండి

- క్లిప్పింగ్‌లు, కంటెంట్ తొలగించాలని కోర్టు ఆదేశాలు



**టి మీడియా, మే 15, హైదరాబాద్ బ్యూరో :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో ఊరట లభించింది. బండి భగీరథ్‌కు సంబంధించిన ఒక కేసు వ్యవహారంలో తనపై జరుగుతున్న రాజకీయ దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఈ వివాదంలో కేంద్ర మంత్రిని లక్ష్యంగా చేసుకుని ప్రసారం చేసిన అభ్యంతరకర కంటెంట్‌ను తక్షణమే తొలగించాలంటూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

### బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపండి

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫోక్సోకేసు వ్యవహారంలో భవిష్యత్తులో ఎక్కడా తన పేరును వాడకుండా నిలువరించాలని బండి సంజయ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా సాగుతున్న ప్రచారాన్ని అడ్డుకోవాలని, ఇప్పటివరకు తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న వివాదాస్పద వీడియోలను, డిజిటల్ కంటెంట్‌ను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన తన పిటిషన్ ద్వారా కోర్టును కోరారు. బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు అదేశాలు జారీ చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని కోర్టు ఆదేశించింది. బండి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకున్న వీడియోలు, పత్రిక క్లిప్పింగులు, డిజిటల్ కంటెంట్, వాల్ పోస్టర్లు ఈ నెల 26లోపు తొలగించాలని అదేశాలు ఇచ్చింది.

### బాలిక వివరాలు సోషల్ మీడియాలో ప్రసారంపై కేసు

మరోవైపు బండి భగీరథ్ కేసులో బాలిక వివరాలు సోషల్ మీడియాలో ప్రసారంపై కేసు నమోదైంది. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో బాలిక ఫొటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాల ప్రసారంపై కేసు నమోదైంది. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు బాధితురాలి ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

- నదిలో తేలియాడే విలాస గదులు



**టి మీడియా, మే 15, రాజమహేంద్రవరం :**
వచ్చే ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వినూత్న ఏర్పాట్లు చేస్తోంది. పుష్కరాల సమయంలో లక్షలాది మంది యాత్రికులు తరలిరావడంతో ఘాట్ల వద్ద విపరీతమైన రద్దీ నెలకొంటుంది. ఈ సమయంలో వీఐపీలు, ప్రత్యేక అతిథుల దర్శనం, పుణ్యస్నానాల కోసం సామాన్య యాత్రికులను కొంతసేపు ఘాట్ల వద్దకు రాకుండా అదుపు చేయాల్సి వస్తోంది. ఈ ఇబ్బందికర పరిస్థితిని అధిగమించేందుకు అధికారులు సరికొత్త ఆలోచన చేశారు.

**కుంభమేళా తరహాలో ఏర్పాట్లు**
ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ కుంభమేళాలో అనుసరించిన విధానాన్ని ఇక్కడ అమలు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా గోదావరి నదిలో అత్యాధునిక, విలాసవంతమైన 'ఫ్లోటింగ్ బోట్ల'ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉన్నత స్థాయి అధికారులు, సినీ ప్రముఖులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, ఇతర రంగాల్లోని నిపుణులు, దేశ విదేశీ ప్రతినిధులు ఈ ఫ్లోటింగ్ బోట్లను వినియోగించుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించారు. దీనివల్ల ఘాట్ల వద్ద రద్దీ తగ్గి సామాన్య భక్తులకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పుణ్యస్నానాలు ఆచరించే వెసులుబాటు కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

**నదిలోనే ఫైవ్ స్టార్ సౌకర్యాలు**
ఈ ఫ్లోటింగ్ బోట్లను పూర్తిగా ప్రత్యేక సౌకర్యాలతో తీర్చిదిద్దనున్నారు. ప్రతి బోటులోనూ ఏసీతో కూడిన వ్యక్తిగత గదులు, అటాచ్డ్ బాత్రూమ్‌లు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తారు. పుణ్యస్నానం కోసం నదిలోకి దిగేందుకు ప్రత్యేకంగా సురక్షితమైన మెట్లు, ప్లాట్‌ఫాంలు ఉంటాయి. స్నానం పూర్తయిన వెంటనే బోటులోని గదుల్లోకి వెళ్లి విశ్రాంతి తీసుకునే సౌకర్యం కల్పిస్తారు. దీంతో వీఐపీలు ఎక్కువ సమయం నది ఒడ్డున వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, నదిలోనే ప్రశాంతంగా గడిపే అవకాశం ఉంటుంది.

**పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు**
అంతేకాకుండా పుష్కర స్నానం అనంతరం పితృదేవతలకు తర్పణాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు బోట్లలోనే ప్రత్యేక స్థలాన్ని కేటాయించనున్నారు. అవసరమైన పూజా సామగ్రి, పురోహితుల సేవలను కూడా అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తున్నారు. భద్రతా పరంగా బోటు చుట్టూ లైఫ్ గార్డులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని మోహరించనున్నారు. పూర్తి స్థాయిలో సీసీ కెమెరాల నిఘా, వైద్య సిబ్బంది, అంబులెన్స్ బోట్లను కూడా సిద్ధం చేస్తున్నారు.

**ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహణ**
ఈ ఫ్లోటింగ్ బోట్ల నిర్వహణను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టాలని యోచిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రైవేట్ సంస్థలు ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపుతున్నాయి. ఒక్కో బోటులో 4 నుంచి 8 మంది వరకు బస చేసేలా డిజైన్లు రూపొందిస్తున్నారు. బుకింగ్ విధానం, ధరలను త్వరలోనే ఖరారు చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ తెలిపారు. పుష్కరాలకు వచ్చే వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, గోదావరి పుణ్యస్నానం ఆధ్యాత్మికతతో పాటు విలాసాన్ని కూడా అందించడమే తమ లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

# చేప ప్రసాదం పంపిణీకి డేట్ ఫిక్స్

- తేదీలు ప్రకటించిన బత్తిని కుటుంబం



**టి మీడియా, మే 15, హైదరాబాద్ బ్యూరో :**
మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా బాధితులకు బత్తిని కుటుంబీకులు తరతరాలుగా చేప ప్రసాదం అందిస్తున్న విషయం విదితమే. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా చేప ప్రసాద పంపిణీని చేపట్టేందుకు బత్తిని కుటుంబం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జూన్? 8వ తేదీ రాత్రి నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్? గ్రౌండ్?లో నిర్వహించనున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు అబిడ్స్?లో తెలంగాణ అగర్వాల్ సమాజ్? ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బత్తిన గౌరీ శంకర్ గౌడ్, బత్తిని అమర్?నాథ్ గౌడ్?లు పాల్గొని వివరాలు వెల్లడించారు.

**జూన్ 8వ తేదీన పంపిణీ**
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మృగశిర కార్తె సందర్భంగా జూన్?8వ తేదీ రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ అవుతుందని తెలిపారు. గత 180 ఏళ్లుగా తమ బత్తిని కుటుంబం ఆస్తమా రోగుల కోసం చేప ప్రసాదాన్ని ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బత్తిన కుటుంబ సభ్యులను అగర్వాల్ సమాజ ప్రతినిధులు సన్మానించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్?లో జరిగే చేప ప్రసాద పంపిణీ కార్యక్రమానికి దేశంలోని పలు రాష్ట్రాల నుండి ప్రజలు వస్తుంటారని వారు తెలిపారు. వారి కోసం ప్రతియేటా తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆహారం, మంచినీరు, మజ్జిగ అందిస్తోందని పేర్కొన్నారు.

**డోర్ డెలివరీ చేస్తామంటే నమ్మొద్దు**
స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఇన్నేళ్లుగా అందిస్తూ వస్తున్న చేప పంపిణీలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగడం లేదని బత్తిని గౌరి శంకర్ అన్నారు. చేప ప్రసాదం కోసం వచ్చే వారు మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్యూ లైన్?లలో నిలబడిన వారిని మాటల్లో పెట్టి, చేప ప్రసాదాన్ని ఇంటికి డెలివరీ చేస్తామని నమ్మిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు.

చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం జూన్ 8వ తేదీ రాత్రి ప్రారంభమై 9వ తేదీ రాత్రి వరకు పంపిణీ సాగుతుందని తెలిపారు. ప్రసాదం లభించని వారికి కవాడిగుడాలోని తమ ఇంటి వద్ద ప్రసాదం అందిస్తామనన్నారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసే వారిని పోలీసులకు అప్పగించాలని బత్తిని గౌరీ శంకర్ సూచించారు.

**180 ఏళ్లుగా ప్రసాదాన్ని పంపిణీ**
సుమారు 180 ఏళ్ల నుంచి చేప ప్రసాదాన్ని బత్తిన కుటుంబానికి వంశస్థులు ఆస్తమా రోగులకు పంపిణీ చేస్తున్నారు. ఏటా మృగశిర కార్తె సందర్భంగా ఈ చేప మందును పంపిణీ చేస్తారు. ఉబ్బసం, ఆస్తమా, దమ్ము, దగ్గు లాంటి అనారోగ్య సమయల వ్యాధుల నివారణకు చేప ప్రసాదాన్ని ఇస్తున్నారు. అయితే ఈ మందును మొదటగా ఓల్డ్? సిటీలో పంపిణీ చేసేవారు. భద్రతా కారణాల దృష్ట్యా దీన్ని నాంపల్లి ఎగ్జిబిషన్? గ్రౌండ్?కు మార్చారు. చేప మందు పంపిణీకి ఒకటి రెండు రోజుల ముందు నుంచే రోగులు ఎగ్జిబిషన్?కు తరలివస్తారు.

**మేము సైతం అంటూ ముందుకొచ్చిన ఎన్‌జీవోలు**
ప్రతి ఏటా ఆస్తమా పేషెంట్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటంతో జీహెచ్ఎంసీతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం, భోజనాలు, తాగునీరు లాంటివి సమకూరుస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల వారే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు చేపమందు కోసం ఇక్కడికి వస్తారు. వారందరికీ నిర్వాహకులు చేపమందు పంపిణీ చేయనున్నారు.

# కన్న బిడ్డను అమ్మి మరో పెండ్లి

- అవమాన భారంతో భర్త ఆత్మహత్య



**టి మీడియా, మే 15, హైదరాబాద్ బ్యూరో:**
వారిద్దరు ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. వారి ప్రేమకు గుర్తుగా ఓ బిడ్డ కూడా జన్మించింది. కానీ, నవ మాసాలు మోసి కన్న బిడ్డను ఆ తల్లి కర్కశంగా వదిలేసి మరో వివాహం చేసుకోవడానికి సిద్ధమైంది. ఈ దారుణ సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి కొహెడలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొహెడలో నివాసముండే పల్లపు గోవర్ధన్ అనే యువకుడిని సరిత అనే యువతి నాలుగేళ్లుగా ప్రేమించి ఇంట్లో తెలియకుండా అతడిని వివాహం చేసుకుంది. వీరిద్దరికి ఒక బిడ్డ పుట్టగా ఇటీవల ఆ బిడ్డను అమ్మేసి ఇంకొకరిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైంది. ఈ విషయంలో గోవర్ధన్ సరితను ఎన్ని సార్లు బతిమాలినా తనతో వచ్చేందుకు నిరాకరించినట్లు తెలిసింది. దీంతొ తీవ్ర మనస్తాపానికి గురైన గోవర్ధన్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన గోవర్ధన్ ఎంతకు తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన అతడి సోదరి ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా ఉరి వేసుకొని గోవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు కారణమైన యువతిని వదిలిపెట్టొద్దు అంటూ ఫోన్లో వీడియో రికార్డ్ చేశాడు. గోవర్ధన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, అమ్మేసిన బిడ్డ ఆచూకీ ఇప్పటివరకు తెలియలేదని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జర్నలిస్ట్ విష్ణుసాగర్‌కు కన్నీటి వీడ్కోలు



**టీ మీడియా, మే 15, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం జానంపేట గ్రామం యువ జర్నలిస్టు, ప్రైవేట్ ఉపాధ్యాయుడు విష్ణుసాగర్ ఆకస్మిక మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామ ప్రజలు శోకసముద్రంలో మునిగిపోయారు. విష్ణుసాగర్ పార్థివ దేహాన్ని సందర్శించిన ప్రతి ఒక్కరూ కన్నీరు మున్నీరయ్యారు. మంచి తనానికి మారుపేరుగా నిలిచిన విష్ణుసాగర్ ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా, జర్నలిస్టుగా, రైతుగా కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని, వృద్ధ తల్లిదండ్రులను పోషిస్తూ తన వృత్తిపట్ల అపారమైన నిబద్ధతతో జీవించారని పలువురు కొనియాడారు. ఇంత చిన్న వయసులో ఆయన మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాయకులు, సగర సంఘం ప్రతినిధులు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు అంబటి స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి, కడమంచి శేఖర్ లక్ష్మణ్, సగర సంఘం నాయకులు తిరుపతయ్య, తదితరులు విష్ణుసాగర్ సేవలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. విష్ణుసాగర్ అంతిమయాత్రలో ఆర్కే రవి, చంద్రాయుడు సహా భారీ సంఖ్యలో జర్నలిస్టులు, సగర సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొని ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన జర్నలిస్టు మిత్రులు, ప్రజాసంఘాల నాయకులు విష్ణుసాగర్ సేవలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. వృత్తి పట్ల అంకితభావం, కుటుంబం పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవాభావం కలిగిన వ్యక్తిని కోల్పోవడం సమాజానికి తీరని లోటు" అని టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు పేర్కొన్నారు.

## వారంలో ఐదురోజుల పనిదినాలను ప్రభుత్వానికి ఉద్యోగ జేఏసీ లేఖ



**టి మీడియా, మే 15, హైదరాబాద్ బ్యూరో :**
కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు అమలు చేస్తున్న 5 రోజుల పనిదినాలను తెలంగాణలోనూ అమలు చేయాలని ఉద్యోగ , ఉపాధ్యాయ,గెజిటెడ్, వర్కర్స్, పెన్షర్ల జేఏసీ ప్రభుత్వానికి లేఖరాసింది.ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కేంద్రం ఇచ్చిన పిలుపు మేరకు ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కూడా వారంలో ఐదురోజుల పనిదినాలను అమలు చేయాలని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ , ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు కోరారు. ఈ విధానం వల్ల ఇంధన పొదుపుతో పాటు కాలుష్యం నివారణ, ఉద్యోగుల భద్రతను కాపాడుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బదులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వహించే అవకాశముంటుందని వెల్లడించారు .తెలంగాణ వార్తలుఈ పనిదినాల గురించి ఉద్యోగ జేఏసీ నాయకులు ప్రభుత్వాలకు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని, ఇప్పటి నుంచైనా రాష్ట్రంలో 5 దినాల పని విధానాన్ని అమలు చేయాలని లేఖలో ముఖ్యమంత్రి ని కోరారు.


## డీసీఎం ఢీకొని నవవధువు మృతి



**టి మీడియా, మే 15, హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్‌లో తీవ్ర విషాదం నెలకొంది. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని చాంద్రాయణగుట్ట ప్రాంతంలో డీసీఎం ఢీకొట్టడంతో నవవధువు దుర్మరణం చెందింది.వివరాల్లోకి వెళ్తే.. బండ్లగూడలోని నూరీనగర్‌కు చెందిన ఫాతిమా బేగం(20) గురువారం రాత్రి తన భర్తతో కలిసి ఓ పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగివస్తుంది. ఆ సమయంలో ఓ డీసీఎం వారు ప్రయాణిస్తున్న యాక్టివా స్కూటీని ఢీకొట్టింది. అనంతరం ఆమెపై నుంచే డీసీఎం వెళ్లింది. దీంతో ఫాతిమా అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. అయితే బైక్‌పై ఉన్న ఆమె భర్త, మరదలు గాయపడ్డారు.ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అలాగే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ధాన్యం కొనుగోలు జాప్యం

- రైతులతో కలిసి బీజేపీ ఆందోళన



**టీ మీడియా, మే 15, పెబ్బేరు:**
పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని వరి ధాన్య సేకరణ కేంద్రంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ ఆరోపించింది. రైతులు నెల రోజులుగా ధాన్యం తెచ్చి, పగలంతా ఎండబెట్టి కష్టపడ్డా 'కాంట' చేయకుండా ఇబ్బంది పెడుతున్నారు. క్వింటాల్‌కు 6 కిలోల చొప్పున తరుగు పేరిట ధాన్యం తీసుకుంటున్నారు. రవాణా విషయంలో కూడా చాలా ఇబ్బందులు పెడుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తుగా పంట సేకరణపై ప్లానింగ్ లేకపోవడం వల్లే రైతులు నష్టపోతున్నారని బీజేపీ పట్టణ శాఖ విమర్శించింది.రైతులు పండించిన పంటను ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే తీసుకోవాలని డిమాండ్ చేసింది. ధాన్య సేకరణలో అలసత్వం వహించి రైతులను ఇబ్బంది పెడితే రైతులతో కలిసి రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేసింది.పట్టణ అధ్యక్షులు కావలి క్రాంతి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి రాఘవేంద్ర గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి కంచె ఆంజనేయులు, జిల్లా కౌన్సిల్ మెంబర్ సూరగౌని రంగస్వామి గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చింతల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అక్క పెళ్లికి చేసిన అప్పు ..యువకుడి ఆత్మహత్య



**టి మీడియా, మే 15, హైదరాబాద్ బ్యూరో :**
అక్క పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన బాగ్ అంబర్‌పేట్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అరవింద్, సంధ్య అనే దంపతుకు కూతురు, కొడుకు శరత్ కుమార్(23) ఉన్నారు. రెండేళ్ల క్రితం అప్పు చేసి కూతురు పెళ్లి చేయగా, పూర్తిగా మద్యానికి బానిసైన అరవింద్ ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు.ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న శరత్ కుమార్ తల్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించడం చూసి తట్టుకోలేక, అప్పు తీర్చే మార్గం లేక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. శరత్ కుమార్ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భారమౌతుందని బిడ్డను అమ్మిన కన్నవాళ్లు

**టి మీడియా, మే 15, మెదక్ :**
మెదక్ జిల్లాలో కన్నప్రేమ కర్కశంగా మారింది. కడుపున పుట్టిన పసికందును కాసుల కోసం అమ్మేసుకున్నారు. ఆరు రోజుల ఆడబిడ్డను మూడు లక్షల రూపాయలకు విక్రయించిన దారుణ ఘటన కలకలం రేపుతోంది. డెలివరీ అయిన కొన్నిరోజుల తర్వాత పాప కనిపించకపోవడంతో ఐసీడీఎస్?(ఇంటిగ్రేటెడ్? చైల్డ్? డెవలప్?మెంట్? అథారిటీ) అధికారులకు అనుమానం వచ్చింది. విషయం పోలీసులకు చేరడంతో గుట్టు బయటపడింది. పాపను క్షేమంగా రక్షించిన పోలీసులు తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. శిశు విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**భారంగా భావించి అమ్మకం**
కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన దేవీసింగ్, శిరీష దంపతులకు ఇప్పటికే ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ ఏడాది మార్చి 27న మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో శిరీషకు నాలుగో సంతానంగా ఆడపిల్ల జన్మించింది. అయితే, నలుగురు పిల్లల పోషణ భారమని భావించిన ఈ దంపతులు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన శారద అనే మహిళా మధ్యవర్తిని ఆశ్రయించారు.



శిరీష-దేవీసింగ్? వీళ్లు పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన వ్యక్తులు. ఇటీవల ఓ పాపకు శిరీష జన్మనిచ్చింది. ఆ తర్వాత ఆ పిల్ల కనిపించకపోవటంతో అనుమానం వచ్చి మాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు వచ్చిన వెంటనే మెదక్? ఎస్పీకి తెలియాజేశాం. వెంటనే ఎఫ్?ఐఆర్?ను నమోదు చేసి ఆదేశాలు ఇవ్వటం జరిగింది. ఆదేశాల మేరకు మెదక్? జోన్? ఇన్?స్పెక్టర్? వారి సిబ్బందితో చర్యలు చేపట్టారు" – ప్రసన్న కుమార్, మెదక్ డీఎస్పీ

**రూ.40 వేలు తల్లిదండ్రుల వాటా**
సిద్దిపేట జిల్లా అల్లినగర్‌కు చెందిన సంతానంలేని దంపతులైన బొమ్మ కళమ్మ, లింగయ్యలకు పసికందును మూడు లక్షల రూపాయలకు విక్రయించేలా బేరం కుదుర్చుకున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన మెదక్ ఎంసీహెచ్ ఆసుపత్రి సమీపంలోనే ప్రధాన మధ్యవర్తి శారద డబ్బులు తీసుకుని పాపను కొనుగోలు చేసిన దంపతులకు అప్పగించింది. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కొనుగోలు దారుల నుంచి తీసుకున్న మూడు లక్షల రూపాయలలో ప్రధాన మధ్యవర్తి శారద సింహభాగం తనే నొక్కేసింది. కన్న తల్లిదండ్రులకు కేవలం 40 వేల రూపాయలు ఇవ్వగా, మిగతా ఐదుగురు సబ్-మీడియేటర్లకు తలా పదివేల చొప్పున పంచిపెట్టింది.

**మొత్తం 10 మందిపై కేసు నమోదు**
ఐసీడీఎస్ కొల్చారం మండల సూపర్‌వైజర్ అనసూయకు వచ్చిన అనుమానంతో విషయం పోలీసులకు చేరింది. రంగంలోకి దిగిన టౌన్ సీఐ మహేష్ కేసు నమోదు చేసి విచారణ జరిపారు. కొనుగోలు చేసిన వారి నుంచి పాపను క్షేమంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ శిశు విక్రయ వ్యవహారంలో మొత్తం పది మందిపై కేసు నమోదు చేసినట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పాప తండ్రి దేవీసింగ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. చిన్నారిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించిన పోలీసులు శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

# మెదక్ జిల్లాలో భారీ చోరీ

- 100 తులాల బంగారం దోచేశారు



**టి మీడియా, మే 15,మెదక్ :**
మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలో భారీ చోరీ జరిగింది. చిలపల్లి గ్రామానికి చెందిన రాములు ఇంట్లో దొంగలు దాదాపు కిలో బంగారు నగలను అపహరించారు. పోలీసుల వివరాల ప్రకారం, రాములు పటేల్ తన కుటుంబసభ్యులు బాన్సువాడలో విందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని పని మనిషి గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. మరో మూడు ఇళ్లలో కూడా బంగారం చోరీకి గురైనట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**
బాన్సువాడ నుంచి ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు పరిశీలించగా బీరువాలో భద్రపరిచిన సుమారు 100 తులాల బంగారు నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంకా ఎంత మేర బంగారం అపహరించారని వివరాలు తెలియాల్సి ఉంది. వెంటనే సమాచారం అందుకున్న మెదక్? ఎస్పీ శ్రీనివాస్?, డీఎస్పీ ప్రసన్నకుమార్?, సీఐ అల్లాదుర్గ్?, రేణుక రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు.బాన్సువాడలో ఫంక్షన్? ఉండటంతో బుధవారం అక్కడికి వెళ్లాం. మా ముగ్గురు కోడళ్ల బంగారం మా ఇంట్లోనే ఉంది. మా కుటుంబం అంతా కలిసే ఉంటాం. ఒక్కొక్కరి దగ్గర 40 తులాల బంగారం ఉంది. పెద్ద కోడలిది 30 తులాలు, కుమారుడిది సుమారు 10 తులాల బంగారం ఉంది. రెండో కోడలిది 20 తులాలు ఉంటుంది" – రాములు పటేల్?, ఇంటి యాజమాని

**పాటించాల్సిన జాగ్రత్తలు**
మీ స్వగ్రామానికి గానీ, బంధువుల ఫంక్షన్?కు గానీ వెళ్లేటప్పుడు విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు ఇంట్లో ఉంచొద్దు. వెంట తీసుకెళ్లడం లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడమే ఉత్తమం. ఇంట్లో అయితే రహస్య ప్రదేశంలో మాత్రమే దాచుకోవాలి.మీ ఇంటికి మోషన్ సెన్సర్ లేదా సెంట్రల్ లాక్ సిస్టమ్, సెక్యూరిటీ అలారం అమర్చుకోవాలి. ఇంట్లో లేనప్పుడు పాలప్యాకెట్లు, పేపర్లు తలుపు ముందు జమవ్వకుండా చూడటం మంచిది. ఇంటి బయట, లోపల కొన్ని లైట్లు ఆన్‌లో ఉంచుకోవాలి.ఊరు, విహార యాత్రలకు వెళ్లే విషయం సోషల్ మీడియాలో(ఫేస్?బుక్?, ఎక్స్, ఇన్?స్టాగ్రామ్) పంచుకోవద్దు.ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.ఊరికి వెళ్లినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.చుట్టుపక్కల అనుమానాస్పదంగా తిరిగే వారిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుకోవాలి.కాలనీల్లో స్వచ్ఛంద కమిటీలను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం. చోరీలకు ముందు దొంగలు కచ్చితంగా రెక్కీ నిర్వహిస్తుంటారు. పగటిపూట వేర్వేరు కారణాలతో వచ్చి కాలనీల్లో రెక్కీ చేసి రాత్రి దొంగిలిస్తుంటారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్?చేసి వెంటనే సమాచారమివ్వాలి.

**కొత్త నేరస్థులే దొంగలుగా**
ప్రస్తుతం జరుగుతున్న దొంగతనాలు ఎక్కువగా కొత్త వ్యక్తులే దొంగలుగా మారుతున్నారు. పలు ఘటనల్లో పాత నేరస్థులతో పాటు కొత్త వారిని పోలీసులు గుర్తిస్తున్నారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం చాలా ఉంది. కొంతమంది అయితే చోరీలే తమ వృత్తిగా భావిస్తున్నారు. ఇలా రకరకాల కొత్త ఎత్తుగడలు వేసి ఎవరికీ అనుమానం రాకుండా దొంగతనాలకు పాల్పడుతున్నారు.




## పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

**టీ మీడియా, మే 15, పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పెబ్బేరు శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పుస్తకాల వల్ల ఎంతో మేధాశక్తి పెంపొందించుకోవచ్చని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన వివరించారు. ఈ గ్రంథాలయాలు గ్రామీణ ప్రాంతాలకు దిక్సూచి లాంటివని, చదువుకోవడానికి, విజ్ఞానాన్ని అందించుకోవడానికి ఈ గ్రంథాలయాలు ఎంతో తోడ్పాటునిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక లైబ్రేరియన్ జ్యోతి, సిబ్బంది జి. గాంధీ, పాఠకులు చంద్రశేఖర్ రెడ్డి, ఎల్లస్వామి, లోకేష్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక టీ మీడియా, మే 15, వనపర్తి బ్యూరో: పెద్దమందడి మండలం దొడగుంటపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా జంగం గోపాల్ తండ్రి చెన్నప్ప, ఉపాధ్యక్షుడిగా బూసని శ్రీకాంత్ తండ్రి ఆంజనేయులు, కార్యదర్శిగా కృష్ణయ్య తండ్రి బాలయ్య, కోశాధికారిగా నందమోని వెంకటయ్య తండ్రి కరెన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా సహకార సంఘం ఎన్నికల అధికారి కవిత ఆధ్వర్యంలో శుక్రవారం దొడగుంటపల్లి గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు నాగన్న, నందమోని తిరుపతయ్య, జంగం పెద్ద నాగరాజు, జంగం చిన్న గోపాల్, ఆంజనేయులు, బి. ఆంజనేయులు, దండు చిన్న రాములు, దండు చెన్నారాయుడు, దండు పెద్ద కురుమన్న, టైలర్ కురుమయ్య, రాజశేఖర్, తోకల సైదులు, బి. శ్రీనివాసులు, బి. సైదులు, డి. కృష్ణ, జంగం నాగరాజు, జేబి రాములు, సంఘం సభ్యులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్ నేపాలీ గ్యాంగ్ దొరికింది

- ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు

**టి మీడియా, మే 15, హైదరాబాద్ బ్యూరో :**
సికింద్రాబాద్ జవహర్‌నగర్‌లో కలకలం రేపిన నేపాలీ ముఠా దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసుకు సంబంధించిన నేపాలీ ముఠాను నేడు పోలీసులు అరెస్టు చేశారు. మీనా, రమేశ్ దంపతులను నేపాల్ సరిహద్దుల్లో పట్టుకున్నారు. నేపాలీ ముఠా జవహర్‌నగర్‌లోని గోల్ఫ్ ఎంక్లేవ్‌లో ఈనెల 11న చోరీ చేసింది. దీనిలో భాగంగా 70 తులాల బంగారం, 20 కిలోల వెండి, విదేశీ డాలర్లు దోచుకుంది. కేసులోని ముఠా సభ్యులు వృద్ధ దంపతులు విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ ఆయన భార్య వైద్యురాలైన విజయలక్ష్మిని తాళ్లతో కట్టేసి మత్తు మందు ఇచ్చి పరారయ్యారు. ముఠాలో ప్రధాన నిందితులు మీనా, ఆమె భర్త రమేశ్?ను నేపాల్ సరిహద్దులో పోలీసులు పట్టుకున్నట్టు సమాచారం. ఈ కేసులో మరో నలుగురు పరారీలో ఉన్నారు. చోరీ జరిగిన రోజు యజమాని ద్విచక్ర వాహనంతో పాటు ఆటోలో నిందితులు పరారయ్యారు. ద్విచక్ర వాహనాన్ని నిందితులు యాప్రాల్ పెట్రోల్ బంక్ వద్ద వదిలి వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. పనిమనిషిని, వృద్ధ దంపతుల వద్ద నేపాలీ జంటను పనిమనుషులుగా చేర్పించిన భీమ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరినీ పీటీ వారెంట్?పై పోలీసులు హైదరాబాద్ తీసుకువస్తున్నట్టు సమాచారం.

**అసలేం జరిగిందంటే**

మేడ్చల్? జిల్లా జవహర్?నగర్?లోని కౌకూరు గోల్ఫ్? ఎన్?క్లేవ్?లో విశ్రామత ప్రొఫెసర్? మురళీధర మోహన్, అతని



భార్య డాక్టర్? విజయలక్ష్మీ నివాసం ఉంటున్నారు. ఇటీవల వారి వద్ద ఓ నేపాలీ జంట పనిలో చేరారు. ఇంటిలో పని చేసిన రోజుల్లో ఎంతో నమ్మకంగా ఉన్నట్లు నటించారు. యజమానులతో సన్నిహతంగా మెలిగారు. కొద్ది రోజుల క్రితం మరో మహిళ వారి బంధువుగా పరిచయం చేసుకుని ఆ ఇంట్లోకి ప్రవేశించింది. తర్వాత సోమవారం రాత్రి నేపాలీ మహిళ పుట్టిన రోజు వేడుకలు ఇంట్లోనే నిర్వహించుకుంటామని యజమానులను అడగగా వారు అంగీకరించారు. దీనినే ఆసరాగా చేసుకుని మరో ముగ్గురు వారి బంధువులం అంటూ ఇంటికి వచ్చారు.

**తాడుతో చేతులను కట్టేసి**

తర్వాత పుట్టినరోజు వేడుక సందర్భంగా యజమాని కేకు ఆర్డర్? చేశారు. ప్రొఫెసర్? దంపతులు భోజనం చేసే సమయంలో నేపాలీ ముఠా పుట్టినరోజు సంబరాలు చేస్తున్నట్లు నటించారు. కాసేపటికి వారు వెనుక నుంచి వచ్చి దంపతులను బెదిరించారు. వారి చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేశారు. వారికి సహకరించకుంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన దంపతులు 'మీకు ఏమి కావాలో తీసుకోండి' అని చెప్పారు. దీంతో దుండగలు ఇంట్లోని సుమారు 70 తులాల బంగారం, 20 కేజీల వెండి, ఇంట్లోని నగదు, 3 వేల అమెరికన్? డాలర్లు, రెండు సెల్?ఫోన్లు, ఒక వాహనంతో అక్కడి నుంచి పరారయ్యారు.

**భయంతో కేకలు వేయడంతో**

అయితే ప్రొఫెసర్? దంపతులకు మత్తు మందు ఇచ్చి వారిని గదిలోకి తీసుకెళ్లి ఇద్దరినీ కట్టిపడేశారు. ఆపై నిందితులు ఆటోలో పరారయ్యారు. ఈ మత్తు మందు కారణంగా వారికి మంగళవారం మధ్యాహ్నం వరకు మెలకువ రాలేదు. తర్వాత దుండగులు ఇంట్లోని అన్ని గేట్లకు తాళాలు వేసి పారిపోయినట్లు తెలిసింది. దిక్కుతోచని స్థితిలో ఆ దంపతులు కేకలు వేశారు. దీంతో అటుగా వెళుతున్న కాలనీ వాసులు వారిని గమనించారు. ఇంటి తలుపులు తీశారు. తర్వాత వారు ఈ సమాచారాన్ని మల్కాజిగిరి పోలీసులకు వెల్లడించారు. దీంతో మల్కాజిగిరి పోలీసు కమిషనర్? సుమతి ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ దోపిడీలో ఏడుగురు పాల్గొన్నట్లు తెలిసింది. ఈ నేపాలీ ముఠాను పట్టుకునేందుకు పోలీసులు 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మల్కాజిగిరి డీసీపీ సీహెచ్? శ్రీధర్? వెల్లడించారు. నేడు ముఠాలోని ఇద్దరిని నేపాల్? సరిహద్దుల్లో అరెస్టు చేశారు. వారినుంచి మరింత సమాచారాన్ని సేకరిస్తున్నారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై త్వరలో పాదయాత్ర

- సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి


**టీ మీడియా, మే 15, వనపర్తి బ్యూరో :**


ఉమ్మడి పాలమూరు జిల్లా బి.ఆర్.ఎస్ నాయకుల సమావేశం శుక్రవారం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్వగృహంలో జరిగింది. ఇట్టి సమావేశములో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ అతి త్వరలో పాదయాత్ర చేస్తామని ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ని సంప్రదించి తేదీ,స్థలం ప్రకటిస్తామని నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లా వ్యక్తి సీఎం అవుతారని పన్నెండు సీట్లు ప్రజలు గెలిపించారు. నల్లమల పులిబిడ్డ అంటూ ప్రసంగాలు ఊదర కొట్టారు. డెబ్బై సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం కి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ గురించి ఒక్కసారి అడగలేదు. పెండింగ్ బిల్లులు మంజూరు చేశారు. కానీ పనులు చేయలేదు. ఐదు రిజర్వాయర్లు, నాలుగు పంప్ హౌస్ లు పూర్తి చేసింది కేసీఆర్. ముప్పై నెలలు గాలికి వదిలేసారు. ఇరిగేషన్ సీజన్ ను లో అసలు పనులు చేయలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ సందర్శించిన దాఖలాలు లేవు. కేసీఆర్ చేసిందనీ నేను చెయ్యను అని అంటున్నాడు. ఇదేం నిర్లక్ష్యం ఒక్కనాడు సమీక్ష లేదు ఎందుకు చేయట్లేదు. ఎదుల నుండి దిండి కి నీళ్ళకోసం 1800 కోట్లతో టెండర్ పిలిచారు. పాలమూరు పూర్తి చేయకుండా అదే ప్రాజెక్టు మీద ఆధారపడ్డ మరో ప్రాజెక్ట్ చేపడుతుంది. ఇదేం పని అవసరం లేని పనులు చేపట్టింది. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే లు ఎవరు దీని మీద మాట్లాడరు. అన్ని ప్రభుత్వాల్లో ఆయనే ఉంటాడు..గత ప్రభుత్వాలు అన్ని ప్రజల్ని మోసం చేశాయి అంటారు. కె.సి. ఆర్ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయించి. వాటి ఫలితాలు పాలమూరు ప్రజలకు అందజేశారు. బీఆర్ఎస్ సాగు నీళ్లు ఇవ్వలేదని కొందరు మాట్లాడుతున్నారు. తెలంగాణ రాకముందు యాసంగి లో నాలుగైదు లక్షల ఎకరాల వరి కూడా సాగు కాలేదు. 2026 యాసంగి లో 65 లక్షల ఎకరాలు సాగు అయింది. కాంగ్రెస్ వచ్చాక ఒక్క ఎకరాకు అయినా సాగునీరు ఇచ్చిందా? తెలంగాణ లో మూడు కోట్ల టన్నుల వడ్లు తెలంగాణ రైతాంగం పండించారు.

తెలంగాణ సాగు విస్తీర్ణం పెరిగి పంటల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. జల సంపద,పాడి పంటలు వృద్ధి చేసి తెలంగాణ దశ దిశను మార్చినం. ట్రాన్స్పోర్ట్ టెండర్ లు అనర్హులకు ఇవ్వడం వల్లే సమస్య వచ్చింది. వాహనాలు ఉన్నాయా లేవా అనేది చూడకుండా టెండర్ లు ఇచ్చారు. మొక్కజొన్న, వరి రైతులు అరిగోస పడుతున్నారు. తరుగు పేరిట రైతులను దోపిడి చేస్తున్నారు. ఈ సమావేశములో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మా రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు నరేందర్ రెడ్డి,అంజన్న యాదవ్,అలా.వెంకటేశ్వర రెడ్డి,చిట్టెం.రామ్ మోహన్ రెడ్డి,మర్రి.జనార్ధన్ రెడ్డి, బీరం.హర్షవర్ధన్ రెడ్డి,మాజీ ఎం.పి శ్రీనివాస్ రెడ్డి, బి.ఆర్.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, ఎం.ఎల్. సిలు వానిదేవి, నవీన్ రెడ్డి మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

## టాప్ 10 మార్కులు సాధించిన మైనార్టీ విద్యార్థి

- సన్మానించిన ఐక్యవేదిక అధ్యక్షుడు డా.సతీష్ యాదవ్

**టీ మీడియా, మే 15, వనపర్తి బ్యూరో :**


10 వ తరగతి లో 585 మార్కులతో తెలంగాణలో టాప్ టెన్ మార్కులు సాధించినందున మొహమ్మద్ ఇంటికి వెళ్లి వారి కూతురు మరియా జీనత్ వారికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించడం జరిగింది. వనపర్తికి సంబంధించి ఒక పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని తెలంగాణ టాప్ లో నిలబడడం వనపర్తికి గర్వకారణమని తెలుపుతూ, చాలామంది ఇలాంటి విద్యార్థులు మార్కులు తెచ్చుకుని వనపర్తికి విద్యాపర్తి అనే పేరును సార్ధకర్థం చేస్తున్నారని. మాకు ఇలాంటి విద్యార్థినీ విద్యార్థుల వివరాలు ఇస్తే అందరికీ సన్మానం చేస్తామని ఈ సందర్భంగా సతీష్ యాదవ్ తెలిపారు. ఈ-ార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక

**టీ మీడియా, మే 15, వనపర్తి బ్యూరో:**
పెద్దమందడి మండలం దొడగుంటపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా జంగం గోపాల్ తండ్రి చెన్నప్ప, ఉపాధ్యక్షుడిగా బూసని శ్రీకాంత్ తండ్రి ఆంజనేయులు, కార్యదర్శిగా కృష్ణయ్య తండ్రి బాలయ్య, కోశాధికారిగా నందమోని వెంకటయ్య తండ్రి కరెన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా సహకార సంఘం ఎన్నికల అధికారి కవిత ఆధ్వర్యంలో శుక్రవారం దొడగుంటపల్లి గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు నాగన్న, నందమోని తిరుపతయ్య, జంగం పెద్ద నాగరాజు, జంగం చిన్న గోపాల్, ఆంజనేయులు, బి. ఆంజనేయులు, దండు చిన్న రాములు, దండు చెన్నారాయుడు, దండు పెద్ద కురుమన్న, టైలర్ కురుమయ్య, రాజశేఖర్, తోకల సైదులు, బి. శ్రీనివాసులు, బి. సైదులు, డి. కృష్ణ, జంగం నాగరాజు, జేబి రాములు, సంఘం సభ్యులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.





## స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలి

- రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు

**టీ మీడియా, మే 15, పెబ్బేరు:**
తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ, బీజేపీ కేంద్ర ప్రభుత్వం 14 పంటల ధరలను పెంచినట్లు చెబుతోందని అన్నారు. ఆహార పంటలు, పప్పు దినుసులు, నూనె గింజలు, వాణిజ్య పంటల ధరలను అరకొరగా పెంచి, తాము రైతుల ఆదాయాలను పెంచామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. అన్ని పంటలకు సమగ్రంగా ఉత్పత్తి ఖర్చులను లెక్కవేసి జ2050 ప్రకారం పెంచకుండా కేంద్రం ఇష్టారీతిగా ధరలు పెంచిందని ఆరోపించారు. తెలంగాణలో ప్రధాన పంటలు వరి, పత్తిని ఎక్కువగా పండిస్తున్నారు. వరికి కేవలం క్వింటాల్‌కు 72 రూపాయలు, పత్తికి క్వింటాల్‌కు 557 రూపాయలు, మొక్కజొన్నకు క్వింటాల్‌కు 10 రూపాయలు పెంచారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వరికి క్వింటాల్‌కు 2389 రూపాయల ధర ఇస్తోంది. ఇప్పుడు వచ్చే ఖరీఫ్ పంటకు 72 రూపాయలు కలిపితే కనీస మద్దతు ధర 2461 రూపాయలు అవుతుంది. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం వరికి 3243 రూపాయలు ధర ఇవ్వాలి. ఈ ప్రకారం వరి రైతులు క్వింటాల్‌కు 782 రూపాయలు నష్టపోతున్నారు. పెంచిన ఈ ధరల వల్ల అన్ని పంటలు వేసిన రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతుందని అన్నారు. పశ్చిమ ఆసియా యుద్ధం వల్ల కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, విద్యుత్తు తదితర వాటిపై పెరిగిన ధరల ప్రభావం వ్యవసాయంపైనే తీవ్ర భారం పడుతోంది. ఈ రకంగా దేశవ్యాప్తంగా రైతాంగంపైనే ఉత్పత్తి ఖర్చులు తీవ్రస్థాయిలో పెరిగే ప్రమాదం ఉంది. దేశవ్యాప్తంగా రైతులు అప్పులు తీర్చలేక రోజుకు 48 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దేశ రైతాంగానికి అరకొర ధరలు పెంచి, రైతులకు మరోసారి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా నష్టం చేసిందని ఆరోపించారు. దేశంలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలలో భాగస్వాములై, రైతాంగానికి ఎం.ఎస్. స్వామినాథన్ సిఫారసులు అమలు జరిగే వరకు ఉద్యమించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్, లక్ష్మీనారాయణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## దోస్త్ రెండవ విడత అడ్మిషన్లు ప్రారంభం

**టీ మీడియా, మే 15, పెబ్బేరు:** ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు దోస్త్ ద్వారా డిగ్రీ కోర్సులు చేసేందుకు రెండవ విడత అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకట ప్రసాద్ తెలిపారు. ఈ నెల 15 నుండి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం, బీకాం కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయని ప్రొఫెసర్ తెలిపారు.



# అజ్ఞాతంలో బండి భగీరథ్

- స్పందించిన బాధితురాలి తల్లి

**టి మీడియా, మే 15, హైదరాబాద్**
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయింది. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. బండి భగీరథ్ విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. తనకు రెండు రోజుల సమయం కావాలంటూ బండి భగీరథ్ కోరారు. ఈ నేపథ్యంలో బాధితురాలి తల్లి శుక్రవారం లేఖను విడుదల చేశారు. చట్టానికి అనుగుణంగా మైనర్ బాలిక గుర్తింపును గోప్యంగా ఉంచుతున్నామని స్పష్టం చేశారు. తన కుమార్తెకు రక్షణ, గౌరవం, భవిష్యత్తు కావాలనే ఉద్దేశంతో ఈ ప్రకటన చేస్తున్నామని వివరించారు. తమది సాధారణ మధ్యతరగతి కుటుంబమని, రాజకీయ లేదా ఆర్థిక ప్రభావం లేదన్నారు. ప్రతీకారం లేదా ప్రచారం కోసం కాదని.. న్యాయం కోసం ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్లు వివరించారు. మౌనం కంటే నిజం చెప్పడం అవసరమని భావించామని ఈ సందర్భంగా బాధితురాలి తల్లి పేర్కొన్నారు. 2025లో బండి భాగీరథ్‌తో పరిచయం ఏర్పడిందని తన కుమార్తె తనకు తెలిపిందని చెప్పారు. తమ కుమార్తెకు చదువులపై దృష్టి తగ్గేలా చేసి, శారీరక సంబంధాలకు ఒత్తిడి తెచ్చారంటూ బండి భగీరథ్‌పై బాధితురాలు తల్లి ఆరోపించారు. 2025, డిసెంబర్ 31 రాత్రి నుంచి 2026, జనవరి1వ తేదీ తెల్లవారుజామున వరకు మొయినాబాద్‌లో జరిగిన ఘటనలను ఈ సందర్భంగా బాలిక తల్లి వివరించారుమద్యం సేవించమని ఒత్తిడి చేసి, బలహీన పరిస్థితిలో అనుచిత ప్రవర్తనకు తమ కుమార్తెను బండి భగీరథ్ గురి చేశాడన్నారు. ఈ ఘటనలతో కుమార్తె తీవ్ర భయం, అవమానం, మానసిక వేదన అనుభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోపణలపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, నిజాలు బయటకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబం వద్ద చాట్స్, మెసేజ్‌లు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఆధారాలు ఉన్నాయని బాధితురాలి తల్లి వెల్లడించారు. అలాగే భగీరథ్ చాటింగ్‌లో క్షమాపణలు చెప్పడం, ఎమోషనల్‌గా ఒత్తిడి చేయడం, శారీరక కలయికపై ఒత్తిడి చేశారని బాధితురాలి తల్లి వాపోయారు.



డిజిటల్ ఆధారాలను భద్రపరచి ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. జనవరిలో బ్రేకప్ తర్వాత బాలిక మానసిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందంగా ఉండే తమ కుమార్తె పూర్తిగా మౌనంగా, భావోద్వేగంగా కుంగిపోయిందన్నారు. ఆ సమయంలో నిందితుడి నుంచి తమకు పలుమార్లు కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. భగీరథ్ మెసేజ్‌ల వల్ల తమ కూతురు మానసికంగా కుంగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. 2026 మార్చి, ఏప్రిల్ నెలల్లో చట్టపరంగా చర్యల తీసుకునేలా తాము ముందుకు వెళ్ళామని ఆమె వివరించారు. ఆ సమయంలో పరోక్ష ఒత్తిళ్లు, రాజీ ప్రయత్నాలు, కేసు పెట్టవద్దంటూ తమకు అభ్యర్థనలు వచ్చాయని తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీన తమ కుటుంబంపై బ్లాక్‌మెయిల్, ఎక్స్‌టోర్షన్ ఆరోపణలతో ఫిర్యాదు నమోదు కావడం భయాందోళనకు గురయ్యామన్నారు. బాధితురాలికి న్యాయం చేయాల్సిన సమయంలో తమ కుటుంబాన్నే నిందితుల్లా చూపించే ప్రయత్నం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 22వ తేదీ సంగప్ప అనే వ్యక్తి తమ ఇంటికి వచ్చి మాట్లాడాడని బాధితురాలి తల్లి చెప్పారు. ఏప్రిల్ 23వ తేదీన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను తాము కలిశామని చెప్పారు. భరోసా కోసం వెళ్లినా తమకు భయపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి తమ కుటుంబం నిరంతర భయం, భావోద్వేగ ఒత్తిడిలో జీవిస్తోందని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. 2026, మే 8న పేట్ బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించి పోక్సో చట్టం కింద ఫిర్యాదు చేశామని బాధితురాలి తల్లి తెలిపారు. మైనర్ బాలిక కేసు అయినప్పటికీ ఐదు గంటలకుపైగా తాము వేచి ఉండాల్సి వచ్చిందని వివరించారు. జీరో ఎఫ్ఐఆర్ అంశంపై పలుమార్లు ఒత్తిడి చేసిన తర్వాత తమ ఫిర్యాదును పోలీసులు స్వీకరించారని చెప్పారు. ఆ సమయంలో తమ కుమార్తె మానసికంగా తీవ్రంగా కుంగిపోయిందని ఆవేదన చెందారు. మైనర్ బాలిక ఇచ్చిన వాంగ్మూలం తర్వాతే కఠినమైన నాన్ – బెయిలబుల్ సెక్షన్లు పోలీసులు చేర్చారన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుతో ఈ కేసు దర్యాప్తు వేగవంతమైందని పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు పూర్తి కాకపోయినా నిందితుడు బండి భగీరథ్ ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నాడని ఈ సందర్భంగా ఆమె విమర్శించారు. వయస్సు పత్రాలు, పరిపాలనా లోపాలపై దృష్టి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితురాలి తల్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వివాదానికి ముందే డేట్ ఆఫ్ బర్త్ రికార్డుల సవరణ ప్రక్రియ జరిగిందని స్పష్టం చేశారు. ఈ పత్రాల్లో సాంకేతిక లోపాలు ఉన్నా, బాలిక అనుభవించిన బాధను అవి తగ్గించ లేవన్నారు. పోక్సో చట్టం కింద బాలికకు లభించే రక్షణను ఎవరూ దూరం చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ కుటుంబం నిరంతర భయం, మానసిక ఒత్తిడికి గురవుతున్నామంటూ బాధితురాలి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. బెదిరింపులు, ఒత్తిళ్లు, సోషియల్ మీడియాలో టార్గెటింగ్ నుంచి రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి బాధితురాలి తల్లి విజ్ఞప్తి చేశారు. న్యాయవ్యవస్థ, దర్యాప్తు సంస్థలు, మహిళా కమిషన్లు, బాలల హక్కుల సంస్థలు జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రతి ఆధారాన్ని చట్ట ప్రకారం భద్రపరిచి స్వతంత్రంగా దర్యాప్తు జరపాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. బాధితురాలి గుర్తింపును బయట పెట్టవద్దని మీడియా, సోషల్ మీడియా వారికి ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత సమాచారాన్ని ప్రచారం చేయడం బాలిక మానసిక వేదనను మరింత పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, చట్టపరమైన వ్యవస్థపై ఇంకా తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. చట్టపరమైన ప్రక్రియలకు తాము పూర్తిగా సహకరిస్తామని వెల్లడించారు. చివరకు నిజం, న్యాయం గెలుస్తాయని బాధితురాలి తల్లి ఆశాభావం వ్యక్తం చేశారు..

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి పడిపోయిన రూపాయి

### డాలర్‌తో పోలిస్తే రూ.96.14కు

- నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**టి మీడియా, మే 15, ఢిల్లీ బ్యూరో:** అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా పతనం అయ్యింది. రికార్డ్ స్థాయిలో డాలర్ విలువ తొలిసారి రూ.96 మార్కును దాటింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో రూపాయి 95.86 వద్ద ప్రారంభమై, ఇంట్రాడే ట్రేడ్‌లో తన మునుపటి ముగింపుతో పోలిస్తే 50 పైసలు పడిపోయి ఒక దశలో రికార్డు కనిష్ట స్థాయి 96.14కు చేరింది. ఆ తర్వాత ఆర్‌బీఐ జోక్యంతో చివరకు అమెరికా డాలర్‌తో పోలిస్తే



తన క్రితం సెషన్ ముగింపుతో పోలిస్తే 22 పైసలు పడిపోయి, 95.86 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో మన రూపాయిపై ఒత్తిడి పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూపాయి 6 శాతానికి పైగా నష్టాలను నమోదు చేసింది. ఇరాన్ యుద్ధ ప్రమాదం పెరగడంతో ముడిచమురు ధరలు పెరగడంతో గత ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూపాయి దాదాపు 2 శాతం క్షీణించింది. బలమైన అమెరికా రిటైల్ అమ్మకాలు, స్థిరమైన కార్మిక మార్కెట్ డేటా, ఫెడరల్ రిజర్వ్ భారీగా వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలను తగ్గించడంతో డాలర్ సూచీ పెరిగింది. ప్రపంచ అనిశ్చితులు, సాపేక్షంగా అధిక విలువలు, ఏఐ ఆధారిత పెట్టుబడి అవకాశాల కొరత వంటివి మూలధన ప్రవాహాలపై భారం మోపాయని ఫారెక్స్ వ్యాపారులు తెలిపారు. "పెరిగిన ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణ ఆందోళనల కారణంగా రూపాయి బలహీనంగా ట్రేడ్ అవుతుందని మేము అంచనా వేస్తున్నాం. బలమైన డాలర్, ఎఫ్ఐఐల నిధుల తరలింపు కూడా రూపాయిపై ఒత్తిడిని పెంచవచ్చు. అయితే, ఆర్‌బీఐ జోక్యం, బంగారం, వెండిపై దిగుమతి సుంకం పెంపు వంటివి రూపాయికి తక్కువ స్థాయిలో మద్దతు ఇవ్వవచ్చు. అమెరికా–రూపాయి స్పాట్ ధర 95.60 నుంచి 96.20 మధ్య ట్రేడ్ అవుతుందని అంచనా." అని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనుజ్ చౌదరి అన్నారు. రూపాయి విలువ పతనమైతే దిగుమతి చేసుకునే వంట నూనెలు, చమురు, సహజవాయువు, ఎలక్ట్రానిక్స్, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు మరింత ఖరీదు అవుతాయి. నిత్యావసరాల ధరలు కూడా పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. విదేశీ ఉన్నత విద్య కోసం తమ పిల్లల్ని పంపిన తల్లిదండ్రులపై భారం పెరుగుతుంది. అయితే, అదే సమయంలో మన దేశం నుంచి వస్తువులు, సేవలు ఎగుమతి చేసేవారికి మాత్రం లాభం కలుగుతుంది.

**నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్? సూచీలు**

మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు, ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొని నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, డాలరుతో రూపాయి మారకం విలువ తొలిసారి 96 మార్కును దాటడం మార్కెట్?ను దెబ్బతీసింది. ఇంకా దీంతో పాటు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రెండు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్సు 4,560 వద్ద ట్రేడవుతోంది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్ ఉదయం 75,497.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,398.72) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,870.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్ ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. చివరికి 160.73 పాయింట్లు నష్టపోయి 75,237.99 వద్ద స్థిరపడింది. ఇక జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 46.10 పాయింట్ల నష్టంతో 23,643.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటర్నల్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ షేర్లు నష్టపోయాయి. ఇక ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు లాభాల్లో ముగిశాయి




## నీట్ పేపర్ లీక్ కేసులో సూత్రధారి గుర్తింపు

# పి.వి.కులకర్ణి అరెస్ట్?

**టి మీడియా, మే 15, ఢిల్లీ బ్యూరో :**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్?–యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఒక ప్రొఫెసర్?ను పుణెలో కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) శుక్రవారం అరెస్టు చేసింది. మహారాష్ట్రలోని లాతూరు ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్? పీవీ కులకర్ణి రసాయన శాస్త్రంలో నిపుణుడు. ఆయన గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం పుణెలో నివసిస్తున్నారు. నీట్? ప్రశ్నపత్రాలను చూడడానికి ఆయనకు యాక్సెస్? ఉంది. అయినప్పటికీ ఆయన తన సొంత ఇంటిలోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు నిర్వహించినట్లు సీబీఐ దర్యాప్తులో తెలిసింది' అని సీబీఐ అధికారులు తెలిపారు.

**అలా తెలిసింది**

'నాలుగేళ్ల క్రితం ఒక ప్రతిష్ఠాత్మక కళాశాల నుంచి పదవీ విరమణ చేసిన కులకర్ణి, నీట్? కెమిస్ట్రీ సబ్జెక్ట్? ప్రశ్నాపత్రాల రూపకల్పన కమిటీ (పేపర్ సెట్టింగ్ కమిటీ)లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన ప్రైవేట్? కోచింగ్ ఇన్?స్టిట్యూట్ కూడా నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా, వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న జరిగిన నీట్?–యూజీ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనితో మే 12న ఆ పరీక్షను ఎన్?టీఏ రద్దు చేసింది. అంతేకాదు దీనిపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. ఈ క్రమంలో, లాతూర్?లోని ఏ ప్రైవేట్? కోచింగ్ సెంటర్? నిర్వహించిన మాక్ టెస్ట్?లోని 42 ప్రశ్నలు, అసలు నీట్? పరీక్షలో వచ్చిన ప్రశ్నలతో అచ్చుగుద్దినట్లు సరిపోలాయని ఆరోపిస్తూ, ఓ విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సదరు కోచింగ్ సెంటర్? సిబ్బందిని, కౌన్సిలర్లను, చదివిన విద్యార్థులను విచారణ చేశారు. అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరా ఫుటేజీలను కూడా స్వాధీనం చేసుకున్నారు. లాతూర్?లో కులకర్ణిని అదుపులోకి తీసుకోవడానికి ముందే, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి మరో ముగ్గురిని సీబీఐ అదుపులోకి తీసుకుంది. వారిలో నాసిక్?కు చెందిన శుభమ్? ఖైర్నార్?, పుణెకు చెందిన బ్యూటీషియన్? మనీషా వాఘ్మారే, అహిల్యానగర్?లోని రాహురికి చెందిన ధనంజయ్ లోఖండే ఉన్నారు' అని అధికారులు తెలిపారు.